

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

కలెక్టర్ కుమార్ దీపక్



క్రీడాకారుడికి చెక్కు అందజేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఏప్రిల్ మే 2 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో 75ప్లస్ క్యాటగిరిలో సింగిల్స్, డబుల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించిన జిల్లా క్రీడాకారుడు పి.రాజలింగు అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మంచిపేరు తీసుకరావాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం థాయిలాండ్‌లో జరిగే అంతర్జాతీయ టోర్నమెంట్‌కు ఎంపికైన రాజలింగుకు బ్యాడ్మింటన్ సంఘం తరుపున రూ.20వేల చెక్కును అందించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల గోవాలో జరిగిన జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో కాంస్య పతకం సాధించి అంత ర్జాతీయ స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకరావాల న్నారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అకాడమి ఛైర్మన్ కందికట్ల మధూ కర్, ప్రతినిధులు వెంకటేశ్వర్లు, శంకర్, వెన్నపురెడ్డి నరేశ్, పాల్గొన్నారు.

చెన్నూర్ లిఫ్ట్ కథ కంచికేనా..?

- ఎత్తిపోతల పథకం భవితవ్యంపై నీలి నీడలు
- రూ. 1658 కోట్ల అంచనా వ్యయంతో రూపకల్పన
- వర్చువల్‌గా ప్రారంభించిన అప్పటి సీఎం కేసీఆర్
- నిధుల కొరతతో పనులు చేపట్టడంలో జాప్యం
- లక్ష ఎకరాలకు సాగునీటిపై ఆదిలోనే హంసపాదు
- కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకుంటే రైతులకు మేలు



జైపూర్ మండలం శెట్‌పల్లి వద్ద ఎత్తిపోతల పథకం రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న అప్పటి మంత్రి ఐకే రెడ్డి, అధికారులు (ఫైల్)

మంచిర్యాల, మే 2 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం శెట్‌పల్లి వద్ద ఏర్పాటు చేయదలచిన చెన్నూరు లిఫ్ట్ ఇరిగేషన్ పథకంపై నీలి నీడలు కమ్ము కున్నాయి. చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రత్యేక చొరవతో రూ. 1658 కోట్ల అంచనా వ్యయంతో రూపుదిద్దుకున్న పథకం పనులను 2023 జూన్ 9న మంచిర్యాల జిల్లా పర్యటనకు వచ్చిన అప్పటి రాష్ట్ర ము ఖ్యమంత్రి కేసీఆర్ వర్చువల్‌గా ప్రారంభించారు. అయి తే లిఫ్ట్ కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం తో పనులు ప్రారంభం కాలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల బ్యాక్ వాటర్ ఆధారంగా చెన్నూరు లిఫ్ట్‌కు రూపకల్పన చేశా రు. చెన్నూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో దాదాపు లక్ష ఎకరాలకు నీరందించే లక్ష్యంతో 10 టీ ఎంసీల సామర్థ్యంగల ఎత్తిపోతల పథకానికి ప్రణాళి కలు రూపొందించారు. పథకంలో భాగంగా మొత్తం మూడు లిఫ్టులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. లి ఫ్ట్-1 ద్వారా జిల్లాలోని మందమర్రి మండలంలోని పొ న్నారం, శంకర్‌పల్లి, జైపూర్ మండలంలోని గంగిపల్లి ట్యాంకుల వరకు, లిఫ్ట్-2 ద్వారా భీమారం మండలం ఆరెపల్లి, చెన్నూరు మండలం ఆస్నాద్, రెడ్డిపల్లి ట్యాం కుల వరకు, లిఫ్ట్-3 ద్వారా కోటపల్లి మండలంలోని శం కర్‌పూర్ ట్యాంక్ వరకు నీళ్లందించేలా డీపీఆర్ తయా రు చేశారు. మూడు లిఫ్టల ద్వారా చెన్నూరు మండ లంలో 31,947 ఎకరాలు, కోటపల్లి మండలంలో 22, 025 ఎకరాలు, భీమారం మండలంలో 10,606 ఎకరా లు, జైపూర్ మండలంలో 19,987 ఎకరాలు, మంద మ ర్రి మండలంలో 5,435 ఎకరాలకు సాగునీరు అందిం చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. లిఫ్ట్ ఏర్పాటు చేయడా నికి సుమారు 3వేల ఎకరాలకు పైగా భూములు అవ సరంకాగా వాటిని స్థానిక ప్రజల నుంచి సేకరించను న్నట్లు ప్రకటించారు.

స్థల పరిశీలన జరిపిన మంత్రి, అధికారులు....

చెన్నూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కోసం అధికారులు డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను కూడా సిద్ధం చేశారు. పథకంలో భాగంగా జైపూర్ మండలం శెట్‌ప ల్లి గోదావరి వద్దగల సుందిళ్ల ప్రాజెక్టు సమీపంలో ఏ ర్పాటు చేయబోయే పంప్‌హౌజ్ ప్రతిపాదిత స్థలాన్ని 2022 ఫిబ్రవరి 1న అప్పటి రాష్ట్ర దేవాదాయశాఖ మం త్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, నీటి పారుదలశాక ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ప్రద ర్శించిన రూట్ మ్యాప్‌ను..

(తరువాయి 7లో)

రీజనల్ కార్యదర్శి పదవికి రాజీనామా

గర్మిళ్ల, ఏప్రిల్ మే 2 (ఆంధ్రజ్యోతి) : టీజీఎస్‌ఆర్‌టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రీజనల్ కార్యదర్శి పదవికి తాను రాజీమానా చేస్తున్నట్లు భీమేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను రాష్ట్ర స్థాయి నాయకుల దృష్టికి తీసు కువెళ్లినా వారి నుంచి ఎలాంటి స్పందన లేదని తెలిపారు. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో మనస్థాపానికి గురై రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆదిలాబాద్‌లో జరిగిన సమావేశంలో ఆయన కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీలో చేరారు.

బీజేపీ ప్రభుత్వం వెంటనే కులగనన చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర సేవాదళ్ నాయకులు నీలకంఠేశ్వర్‌రావు

మంచిర్యాలక్రైం, మే2(ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం కాలయాపన చేయకుండా వెంటనే కులగణన చేయాలని రాష్ట్ర సేవాదళ్ నాయకులు డాక్టర్ నీల కంఠేశ్వర్‌రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఓట్ల కోసమే కులగణన చేపడతామంటూ మభ్యపెడుతుందన్నారు. వెంటనే కుల గణన చేపట్టి దామాషా ప్రకారం రిజర్వే షన్ల కోసం పార్లమెంట్‌లో బిల్లుప్రవేశ పెట్టాలని డిమాండ్‌చేశారు. గతంలో కూడ కుల గణన చేపడతామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేశం, రాజేశ్వర్ గౌడ్, రాజయ్య, రాజేశ్‌చారి, పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థం పెరుగన్నం పంపిణీ



పెరుగన్నం పంపిణీ చేస్తున్న విజిత్‌కుమార్

గర్మిళ్ల, ఏప్రిల్ మే 2 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ప్రజల సౌకర్యార్థం పెరుగన్నం పంపిణీ చేస్తున్నామని నడిపెల్లి చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు విజిత్‌కుమార్ అన్నారు. మంచిర్యాలోని ఐబీ చౌరస్తాలో చేపట్టిన దివాకరన్న పెరుగన్నం పంపిణీ శుక్రవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా విజిత్‌కుమార్ మాట్లాడుతూ పెరుగన్నం పంపిణీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ఎంపీకి వినతి

జన్నారం, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జన్నారం మండల అభివృద్ధి కమిటీ నాయకులు శుక్రవారం ఆదిలాబాద్ ఎంపీ నగేష్‌ను, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌లను కలిసి వినతి పత్రాలు అందించారు. ముంబై నుంచి నిర్మల్ మీదుగా ఖానాపూర్ వరకు ఉన్న జాతీయ రహదారిని కడెం, జన్నారం, దండేపల్లి మీదుగా లక్సెట్టిపేట వరకు పొడగించాలని, జన్నారం మీదుగా భారీ వాహనాల రాకపోకలకు అనుమతించాలని కోరారు. అలాగే జన్నారం మండల కేంద్రంలో 30 పడకల ఆసుపత్రిని మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ శ్రీరాముల కొండయ్య, కో కన్వీనర్ కోడూరి చంద్రయ్య, అశోక్, సత్తన్న, శ్రీనివాసరావు, షబ్బీర్ పాషా, షేక్ అక్బర్ పాల్గొన్నారు.

మొక్కలకు క్రమం తప్పకుండా నీరందించాలి

- డీపీవో వెంకటేశ్వర్‌రావు

జైపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : నర్సరీల్లోని మొక్కలకు క్రమం తప్పకుండా నీరందించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఇందారం, టేకుమట్ల, కిష్టాపూర్, వేలాల గ్రామపంచాయతీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్లాస్టిక్, వ్యర్ధాలను రోడ్లపై ఉంచకుండా శుభ్రం చేయాలన్నారు. డ్రైనేజీల్లో పూర్తిస్థాయిలో మట్టి తీయా లన్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, తాగునీటి సమస్య లేకుం డా చర్యలు తీసుకోవాలన్నారు. నీటిలో బ్లీచింగ్ పౌడర్ కలపాలని, ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా చేయాలన్నారు. ఎండల తీవ్రత నుంచి నర్సరీల్లోని మొక్కలను రక్షించుకోవడానికి నెట్‌షెడ్‌లను సరి చేసుకోవాలన్నారు. గ్రామాల్లోని బస్టాండ్, కూడళ్ల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేసి రంజాన్‌లలో ఎప్పుడు నీరు ఉండేలా చూడాలన్నారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు, పంచాయతీ కార్యదర్శులు సుమన్, శ్రావణి, ప్రశాంత్, రాకేష్ ఉన్నారు.

నేటి మంచిర్యాల బంద్‌కు మద్దతు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

గర్మిళ్ల, ఏప్రిల్ మే 2 (ఆంధ్రజ్యోతి) : జమ్ముకాశ్మీర్‌లోని పెహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని ఖండిస్తూ హిందూ ఐక్య వేదిక, చాంబర్ ఆఫ్ కామర్స్ శనివారం ఇచ్చిన మంచిర్యాల కార్పొరేషన్ బంద్‌కు మద్దతు తెలుపుతున్నట్లు బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు గాదె సత్యం తెలిపారు. శుక్రవారం మంచిర్యాలలోని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌కుమార్ ఆదేశాల మేరకు బంద్‌కు మద్దతు తెలుపుతున్నామన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

'భగీరథ' రావట్లే..

తాగునీటికి ఇక్కట్లే

- ఏజెన్సీ ప్రజలకు తీవ్ర కష్టాలు
- పట్టించుకోని అధికారులు

6

మంటలు చల్లార్చేదెలా..?

- బెల్లంపల్లి అగ్నిమాపక కేంద్రంలో నీళ్లు లేని వైనం
- ఫైర్ ఇంజన్‌లో నీటి కోసం.. ఆరు కిలోమీటర్లు వెళ్లాల్సిన దుస్థితి
- దూర భారంతో ఇబ్బందులు
- అగ్ని ప్రమాదాల్లో ఆస్తి నష్టాలు

7

రైస్‌మిల్లర్లు లక్ష్యాన్ని పూర్తి చేయాలి



రైసుమిల్లులోని ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మందమర్రిరూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : రైసుమిల్లర్లు కేటాయించిన లక్ష్యాన్ని గడువులోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీ గణపతి, అంబికాసాయి, వాసవీ, వెంకటేశ్వర రైసు మిల్లులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొని రైసుమిల్లులకు తరలిస్తుందన్నారు. రైసుమిల్లులకు వచ్చిన లారీలను వెంటనే అన్‌లోడ్‌చేసి పంపించాలన్నారు. అవసరం అయితే హమాలీల సంఖ్యను పెంచుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలవద్ద రైతులకు మంచినీరు, నీడ, ఓఆర్‌ఎస్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం సన్నవడ్లకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. రిజిష్టర్‌లను, రికార్డులను పరిశీలించారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యంచేస్తే చర్యలుంటాయన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సతీష్‌కుమార్ ఉన్నారు.

రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలి

- సమీక్షా సమావేశంలో మంత్రి శ్రీనివాస రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

నస్పూర్, ఏప్రిల్ మే 2 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ హౌ జింగ్ సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచిం చారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణారావు, సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్ట ల్, గృహ నిర్మాణశాఖ ఎండీ గౌతమ్, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ క్రిస్టియానా, జడ్ చంగ్తులతో కలిసి శుక్రవారం కలెక్టర్, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూభారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణ, నీట్ పరీక్షలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు తదితర అంశాలపై సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూభారతి నూతన ఆర్‌వోఆర్ చట్టంపై మొదటివిడతగా నాలుగు జిల్లాల్లో నాలుగు మండలాల్లోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి సమస్యలు పరిష్కరించేం దుకు చర్యలు చేపడతామన్నారు. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో జిల్లాకు ఒక మండలంలో ఈ నెల 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ స మస్యలపై దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. జూన్ 2వ తేదీ వరకు పైలెట్ ప్రాజెక్టు కింద వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాల న్నారు. సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ భూభారతి నూతన ఆర్‌వోఆర్‌చట్టంలో భాగంగా పైలెట్ మండలంగా జిల్లాలోని భీమారం మండలాన్ని ఎం పిక చేసినట్లు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేం దుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1204 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, గృహ నిర్మాణ ప్రాజెక్టు అధికారి బన్సిలాల్, కేజీబీవీ ప్రిన్సిపాల్ ప్రసాద్, ఏసీపీ ప్రకాశ్, భూ సర్వే ఏడీ శ్రీనివాస్, తహసీల్దార్‌లు తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వెంటాడుతున్న అకాల వర్షం..గాలివాన

- లేచిపోయిన ఇండ్ల పైకప్పులు
- రాలిన మామిడికాయలు..

నెన్నెల మే 2 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజలను వాన గండం వెంటాడుతోంది. రెండు రోజుల క్రిందట అకాల వర్షం నష్టాన్ని మిగల్చగా గు రువారం రాత్రి వడగండ్ల వాన మరోసారి బీభత్సం సృష్టించింది. నెన్నెల, గంగారం గ్రామాల్లో గాలి ధాటికి ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి. పలుచోట్ల భారీ వృక్షాలు విరిగి పడ్డాయి. కరెంటు స్థంభాలు నేల కొరగడం తో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అయిదు, ఆరు రోజుల్లో కోతకోయాల్సిన మామిడి కాయలు నేలరాలడంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారు. దిగుబడులు చేతికి వచ్చే వేళ వరి పంటలు దెబ్బతిన్నాయి. వ డగండ్ల ధాటికి కంకుల గింజలు రాలిపోయాయని రైతులు చెప్పారు. ప రిహారం అందజేసి తమను ఆదుకోవాలని ఇండ్లు దెబ్బతిన్న బాధితులు పంటలు నష్టపోయిన రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ మహేంద్ర నాథ్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి మండలంలో పర్యటించి బాధితులతో మాట్లాడి వివరాలు సేకరించారు.

చెన్నూరు : మండలంలో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. దీంతో మండలంలోని లంబడిపల్లి, లింగంపల్లి, అక్కెపల్లి, అంగ్రాజ్‌పల్లి, కిష్టంపేట తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రా ల్లో ఉన్న ధాన్యంపై రైతులు కవర్లు కప్పారు. కొన్ని చోట్ల కవర్లపై నుంచి నీరు చేరి కొంత ధాన్యం తడిసిపోయింది. వర్షం నీరు చేరడంతో రైతులు నీటిని ఎత్తి పోస్తున్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. అలాగే ఈదురుగాలులకు చెన్నూరు మంచిర్యాల ప్రధాన రహదారిపై చెట్లు నేలకొరిగాయి. శుక్రవారం రోడ్డుపై పడిన చెట్లను తొలగించారు.

భీమారం: భీమారం మండలంలో గురువారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. తోటల్లోని మామిడికాయలు నేలరాలిపోగా, పంటలు నేలవాలాయి. ఖాజీపల్లి గ్రామంతో పాటు పలు గ్రామాల్లో గాలికి ఇళ్ల పైకప్పులు లేచిపోయి దూరంగా పడ్డాయి. కొనుగోలు కేం ద్రాల్లో ఆరబోసిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో కష్టపడి పండించిన ధాన్యం వర్షార్పణం అయ్యింది. అలాగే గాలి వానకు పెద్ద పెద్ద



భీమారం మండలంలో నేలరాలిన మామిడి కాయలు

వృక్షాలు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శుక్రవారం సాయంత్రం వరకు వరకు కరెంటు రాలేదు. విద్యుత్ అధికారులు విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు. అలాగే వడ గండ్ల వాన గాలిదు మారంతో ప్రారంభం కాగా ఆరేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద చెట్లు విరిగి పడ్డాయి. అలాగే కొత్తగూడెంలో రోడ్డుకు అడ్డంగా భారీ చెట్టు విరిగి పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తోటల్లోని మామిడి చెట్ల కొమ్మలు విరిగి పోయాయి. పలువురు రైతుల పొలాల్లో నీరు నిలిచిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్ట పోయిన రైతులకు పరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

జైపూర్ : రెండు రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షం, గాలి దుమారం వల్ల పౌనూరు, కిష్టాపూర్, శివ్వారం గ్రామాల్లో భారీ నష్టం వాటిల్లింది. పౌనూరు గ్రామపంచాయతీలో చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పౌనూరు గ్రామ పంచాయతీలోని కాలనీలో తాగడానికి నీరు కూడా రావడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు.

కాలనీలో ఒకే చేతి పంపు పనిచేయడంతో చేతి పంపు వద్ద నీటి కోసం క్యూలో నిలబడుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



నెన్నెల మండలం గంగారం లో రేకుల లేచిపోయిన ఇల్లు

ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటర్ ట్యాంకుల ద్వారా వాటర్ అందించాలని, విద్యుత్ మరమ్మతులను త్వరగా పూర్తి చే యాలని ప్రజలు కోరుతున్నారు.

గాలి దుమారానికి కిష్టాపూర్ గ్రామం లో కరెంటు తీగలపై చెట్లు విరిగి పడడంతో కరెంటు స్తంభాలు నేలకొ రిగాయి. కిష్టాపూర్, శివ్వారం, పౌనూరు గ్రామాల్లో సుమారు 30 ఎక రాల్లో మామిడి తోటలకు నష్టం వాటిల్లిందని రైతులు పేర్కొన్నారు. గాలి దుమారానికి మామిడికాయలు నేలరాలి కింద పడడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. అలాగే కుందారం గ్రామంలో అకాల వర్షానికి వరిధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం తడిసిందని రైతులు వాపోతున్నారు.

మందమర్రిరూరల్ : మండలంలో గురువారం రాత్రి వీచిన గాలి దుమారానికి మామిడి రైతులు నష్టపోయారు. మామిడి గట్టు, పొన్నారం గ్రామాల్లోని వందలాది ఎకరాల్లో రైతులు మామిడితోటలను సాగు చేస్తున్నారు. గాలి దుమారానికి మామిడికాయలు నేల రాలిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు పరిశీలించి ప్రభుత్వం నష్టపోయిన మామిడి రైతులకు పరిహారం అందించాలని మామిడి రైతులు కోరుతున్నారు.

ఏకరూప దుస్తులు సకాలంలో అందజేస్తాం

వేణుగోపాల్, ఎంఈవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: ఏకరూప దుస్తులు సకా లంలో అందజేసేందుకు ఏం చర్యలు తీసుకుం టున్నారు?

ఎంఈవో: మండలంలోని 56 ప్రభుత్వ పాఠశాలల కు చెందిన మూడు వేల మంది విద్యా ర్థులకు పంపిణీ చేసే యూనిఫాం కుట్టే ప్రక్రియ డ్వాక్రా సంఘాల ద్వారా కొన సాగుతోంది. పాఠశాలల పునః ప్రారంభా నికి ముందే విద్యార్థులకు అందించేం దుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పాఠశాలల కు వంట పాత్రలు పంపిణీ చేశారా?

ఎంఈవో: మండ లంలోని 30 పాఠశాల లకు వంట పాత్రలు మంజూరయ్యాయి. ఆయా పాఠశాలలకు అందజేశాం. ఇంకా మిగిలి న వాటికి త్వరలోనే అందజేస్తాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో అన్ని పాఠ శాలలో మౌలిక సదుపాయాలు ఉన్నాయా?

ఎంఈవో: మండలంలో 37 పాఠశా లల్లో గతంలో ఆన్‌లైన్ ద్వారా నమోదు అయిన మౌలిక వసతులు, సౌకర్యాల ప్రక్రియపై ఇటీవల డీఈడీ ట్రైనీ విద్యా ర్థులచేత సర్వే చేయించాం. మౌలిక వస తులు లేని చోట్ల చర్యలు తీసుకుంటాం.

- సిర్పూర్(టి), ఆంధ్రజ్యోతి

భగీరథ రావట్లే తాగునీటికి ఇక్కట్లే



మాన్కుగూడలోని బావిలో అడుగంటిన జలం

జైనూర్/సిర్పూర్(యు), మే 2 (ఆంధ్రజ్యోతి): నీటి ఎద్దడి గిరిజనులను నిత్యం కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఎండాకాలం ఏజెన్సీ గ్రామాల్లో తాగునీటి సమస్యలు మొదలవుతాయి. భుగర్భ జలాలు తగ్గుముఖం పట్టడం, స్థానిక నీటి వనరులు వట్టి పోతుండడమే కారణం. మిషన్ భగీరథ పథకం చాలాగ్రామాల్లో అలంకారప్రాయంగా మారడంతో బిందెడు నీటి కోసం కిలో మీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ బావులు, చెలమల వద్దకు వెళ్తున్నారు. ఏజెన్సీ మండలాల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాక పోవడంతో చాల గూడేలు, తండాల్లో రోజూ ఉదయం నుంచే నీటి కోస వేట సాగిస్తు న్నారు. చెలిమలు, బోరు బావుల నుంచి బిందెలు, ఎడ్లబండ్లపై డ్రమ్ములు కట్టుకుని వెళ్లి తెచ్చుకుంటు న్నారు. భగీరథ ద్వారా ఇంటింటికీ నీటి సరఫరా చేస్తున్నామని అధికారుల లెక్కల్లో కన్పిస్తున్నా, క్షేత్రస్థాయిలో అసంపూర్తి పనులే దర్శనమిస్తున్నా యి. ఇప్పటికీ చాలా గ్రామాల్లోని గిరిజనులు చేతిపంపులు, బావుల్లో రంగు మారిన, పాచి పట్టిన నీళ్లపైనే అధారపడుతున్నారు. ప్రధానంగా ఏజెన్సీలో నీటి వనరులు సైతం అంతంత మాత్రం గానే ఉండడంతో, ఈ నెలన్నర రోజుల్లో తీవ్ర ఇక్కట్లు తప్పేలా లేవని వాపోతున్నారు.

సిర్పూర్(యు) మండలంలోని రాగాపూర్‌లో రెండు రోజులకోసారి నీటి సరఫరా చేస్తు న్నారు. దీంతో సరిపడా నీరు లేక గ్రామ సమీపంలోని చెరువు కట్ట కింద ఉన్న బావి నీటిని కాలినడకన వెళ్లి తెచ్చుకుంటున్నామని గిరిజనులు వాపోతు న్నారు. దేవుగూ డలో సైతం భగీరథ నీరు సరఫరా కావడం లేదు. దీంతో గ్రామస్థులు అర కిలో మీటరు దూరంలో ఉన్న బావి వద్దకు కాలినడకన వెళ్లి తాగు నీటిని తెచ్చుకుంటున్నారు. భానుడి ప్రతాపంతో భూ గర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. దీంతో అ బావిలోను నీటి లభ్యత తగ్గుతోందని ప్రజలు అం దోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటికి ఇతర అవస రాలకు నీటిని తెచ్చుకోవ డం కష్టంగా ఉందని చెబుతున్నారు. అధికారు లు స్పందించి విషన్ భగీరథ నీరు సరఫరా చేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

వట్టి పోయిన బోర్లు..

జైనూరు మండలంలోని మాన్కుగూడ గ్రామ పంచాయతీలో మూడు ఆవాస గ్రామాలు ఉన్నాయి. పంచాయతీలో ఉన్న ఐదు బోర్లలో మూడు వట్టి పోయాయి. ఉన్న రెండింటిలోనూ గంటకు రెండు, మూడు బిందెలు మాత్రమే నీళ్ల వస్తున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. నిత్యం ఉదయం నుంచే ఈ చేతి పంపుల వద్దకు వెళ్లి వచ్చే అరకొర నీటి కోసం గంటల తర బడి నిరీక్షిస్తున్నారు. భగీరథ నీరు వారంలో రెండు రోజులు మాత్రమే సరఫరా అవు తుందని వారు చెబుతున్నారు. దీంతో తాగునీటి అవస్థలు తప్పడం లేదు. గ్రామ పంచాయతీ ట్యాం కర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నా, కష్టాలు తప్పడం లేదని వాపోతున్నారు.



బావి నుంచి నీటిని తోడుతున్న గిరిజనులు

శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌వో రమాదేవి

తిర్యాణి, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీవైఎస్‌వో ఆర్ రమాదేవి అన్నారు. మండల కేంద్రంలో డీవైఎస్‌వో శుక్రవారం క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్ముందు క్రీడలతో మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. వేసవి కాలంలో నీరు ఎక్కువగా తీసుకోవాలని, సెల్‌ఫోన్‌కు పరిమితం కాకుండా క్రమ శిక్షణతో ఆటలు ఆడి భవిష్యత్ కార్యాచరణను ఏర్పర్చుకోవాలని సూచించారు. అంతకు ముందు ఆమె క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో గిరిజన క్రీడాధికారులు మీనారెడ్డి, జీవరత్నం, క్యాంపు ఇన్‌చార్జి లక్ష్మణ్, సుభాష్, శ్రీను, కోచ్‌లు విదాయసాగర్, రవీందర్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

అడవిలో చెట్లను నరికిన ఇద్దరి రిమాండ్

ఆసిఫాబాద్‌రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): వాడిగొంది గ్రామానికి చెందిన టేకం రాజు, సిడం మారుతి అడవిలో చెట్లను నరికినందుకు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. జోడేఘాట్ అటవీ క్షేత్రాధికారి జ్ఞానేశ్వర్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా ప్రిన్సిపాల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ అనంతలక్ష్మి వారికి 14 రోజుల రిమాండ్ విధించారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ సంతోష్, బీట్ అధికారి అమరేందర్, శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిమార్గం అనుసరించాలి



మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

లింగాపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భక్తిమార్గం అనుసరించాలని కైలాస్ టేకడి లింబామహరాజ్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మండలంలోని నడంగూడా గ్రామంలో జగదంబాదేవి విగ్రహం, సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో శుక్రవారం వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి జగదంబాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రక్కుబాయి లక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు,

పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు

ఆసిఫాబాద్‌రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. ఆసిఫా బాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పోలీసు శాఖ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ఫిల్టర్, ఫ్రిడ్జ్‌ను ఏఎస్పీ చిత్తరంజన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వాటర్ ఫిల్టర్, ఫ్రిడ్జ్‌ను ప్రారంచామని చెప్పారు. కార్యక్రమంలో సీఐ రవీందర్, ఎస్సై అంజన్న, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఒప్పంద పద్ధతిన పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): రైజింగ్ అండ్ ఆక్సిలరేటింగ్ ఆఫ్ ఎంఎస్ఎంఈ కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా జిల్లా పరిశ్రమల కేంద్రంలో ఏర్పాటు చేసిన సంస్థ అభివృద్ధి కేంద్రంలో ఒప్పంద పద్ధతిన పోస్టులు భర్తీ చేసేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ అశోక్ శుక్రవారం ఒక ప్రటనలో తెలిపారు. ర్యాంప్ పథకం ద్వారా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా రంగాల అభివృద్ధికి మార్కెట్, సాంకేతి క ఆధునికరణ పెంపొందించడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కేంద్రంలో మేనేజర్, సహాయ మేనేజర్ పోస్టులను ఒప్పంద పద్ధతిన భర్తీ చేసేందుకు అభ్యర్థులు ఈ నెల 10 లోగా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అందజేయాలని సూచించారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

తిర్యాణి, మే 2(ఆంధ్రజ్యోతి): మండలం లోని ఎర్రబండ, గీసీగూడ, తాటిగూడ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీ గిరి జనులకు సంబంధించి భూ సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కోరారు. శుక్రవారం తహసీల్దార్ సూర్యప్రకాష్‌ను కలిసి మాట్లాడారు. గిరిజ నులు నివసిస్తున్నా కానీ అటవీ అధికా రులు ఇక్కడ ఉన్న భూములు తమవే అంటున్నారని ఆ సమస్యను రెవెన్యూ సిబ్బంది పరిష్కరించి ఆదివాసులకు రైతు బంధుతో సహా ప్రభుత్వ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవా లన్నారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, నాయకులు సాగర్, గణపతి, వెంకటేశంగౌడ్, జగన్ పాల్గొన్నారు.

గోలేటిలో కార్డన్‌సెర్చ్



మాట్లాడుతున్న సీఐ బుద్దెస్వామి

కాగజ్‌నగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం గోలేటిలో శుక్రవారం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ బుద్దెస్వామి మాట్లాడుతూ శాంతి భద్రత పరిస్థితులు మెరుగుపర్చడం కోసం పోలీసులు కృషి చేస్తున్నారని తెలిపారు. పోలీసులు, ప్రజల మధ్య సంబంధాలు బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై చంద్రశే ఖర్, సిబ్బంది పాల్గొన్నారు. గుడుంబా తయారీ చేస్తున్న ఐదుగురు వ్యక్తు లపై కేసులు నమోదు చేశారు.

రెవెన్యూ సదస్సులు పకడ్బందీగా నిర్వహించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా

ఆసిఫాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం చేపట్టిన భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టంలో భాగంగా ఈ నెల 5 నుంచి 20 వరకు జిల్లాలో ఒక మండలంలో నిర్వహించే రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబందాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభు త్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్, గృహ నిర్మాణ శాఖ ఎండీ గౌతం, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ క్రిస్టియానా జడ్ చంగ్తులతో కలిసి శుక్రవారం వీసీ ద్వారా జిల్లా కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు, జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై మొదటి విడతగా రాష్ట్రంలోని 4 జిల్లాలో 4 మండలాల్లో గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని చెప్పారు. వివిధ రకాల సమస్యలపై ఆర్జీలను స్వీకరించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇంకా రాష్ట్రంలో 28 జిల్లాల్లో జిల్లాకు ఒక మండలంలో ఈ నెల 5న నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. జూన్ 2వ తేదీ వరకు పైలేట్ ప్రాజెక్టు కింద వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాల న్నారు. పైలేట్ ప్రాజెక్టు కింద చేపట్టిన 4 మండలాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలపై 12,759 దరఖాస్తులు వచ్చాయ ని, రాష్ట్రంగా జరిగే రెవెన్యూ సదస్సులలో దాదాపు 15 లక్షల దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. భూ భారతి చట్టంలో దరఖాస్తు సక్రమంగా జరిగేందుకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రభుత్వ భూ ములలో పోజిషన్ ఉన్న రైతుల దరఖాస్తులు పరిశీలిస్తామన్నారు. భూమి లేని అర్హులైన నిరుపేదలు ఉన్నట్లయితే పట్టాలు ఇచ్చేందుకు సానుకూల నిర్ణయం తీసుకుంటామని తెలిపారు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలోని వీసీ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టంలో భాగంగా పైలేట్ మండలంగా జిల్లాలోని పెంచికలపేట మండలాన్ని ఎంపిక చేశామని అన్నారు. ఈ నెల 5 నుంచి 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించనున్నామని చెప్పారు. ప్రత్యేక బృందాలను నియమించి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామస భలు నిర్వహిస్తామని అన్నారు. జిల్లాలో నీట్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లా కేంద్రం లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలల్లో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. 287 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలి పారు. పరీక్షా కేంద్రంలో అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుం దన్నారు. సమావేశంలో గృహనిర్మాణ, విద్యాశాఖ, నీట్, పరీక్షల సమన్వయకర్త లక్ష్మినర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత



నియామకపత్రం అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

శ్రీరాంపూర్, మే 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో శుక్రవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క 21 మందికి కారుణ్య నియామకపత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సింగరేణి కారుణ్య నియామక వయో పరిమితిని 35 నుంచి 40 ఏళ్ల వరకు పెంచడం వల్ల నిరుద్యోగులకు మంచి అవకాశమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. కార్మికులు, యూనియన్ నాయకుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు వయో పరిమితిని పెంచామని తెలిపారు. మనకు ముందు తరాల వారు సింగరేణిని ఆర్థికంగా బలమైన సంస్థగా అందించారని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సింగరేణిలో ఉద్యోగి నుంచి సీఎండీ వరకు అందరికీ సమాన బాధ్యత ఉంటుందన్నారు. ఉత్పత్తి వ్యయం తగ్గించేందుకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. సింగరే ణి సీఎండీ ఎన్ బలరామ్ మాట్లాడుతూ సంస్థ అభి వృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ అన్నిరకాల సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే వయో పరిమితి సడలింపును అంగీకరించడం రిగిందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ . ఉద్యోగంలో చేరిన యువత కష్టపడి పనిచేస్తూ ఉన్నత శిక్షరాలకు ఎదగాలని, విధులకు గైర్హాజరు కావద్దని సూచించారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ మాట్లాడుతూ, దేశంలోని ఏ బొగ్గు గనుల్లో లేనివిధంగా వయో పరిమితిని పెంచడం సంతోషదాయక మన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్(ప్రాజెక్ట్స్, ప్లానింగ్, పర్సనల్) కె వెంకటేశ్వర్లు, అధికారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీప తిగౌడ్, జీఎం(పర్సనల్) ఐఆర్-పీఎం కవితానాయుడు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనులను కార్మికులు కాపాడుకోవాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి శ్రీనివాస్

శ్రీరాంపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వేలం వేస్తూ ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్న బొగ్గు బ్లాకులను కార్మికులు కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 20వ తేదీన నిర్వ హించనున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ శ్రీరాంపూర్‌లోని జీఎల్‌బీకేఎస్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా అధ్యక్ష తన సమావేశం ఏర్పాటు చేశారు. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 20వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సమ్మెకు సింగరేణి కార్మికులు మద్దతు తెలపాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ కృష్ణ, ప్రధాన కార్యదర్శి సీతారామయ్య, నాయకులు పోతు ల కృష్ణయ్య, నరేష్, రామకృష్ణ, మేకల రామన్న, కాపు కృష్ణ, దేవయ్య, నరసింగం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాలల్లో ఉత్తమ విద్య

శ్రీరాంపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : సింగ రేణి పాఠశాలల్లో ఉత్తమ విద్యను అంది స్తున్నామని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. సీసీసీలోని సింగరేణి పాఠశా లలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం ఆయన అభినం దించారు. 62 మంది విద్యార్థులకుగాను 61 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. కార్యక్ర మంలో ఎస్ ఓ టు జీఎం సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, పాఠశా ల కరస్పాండెంట్ రాజేశ్వర్, హెచ్ఎం సంతోష్, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, అనురా ధ, శ్రీపతిరావు, శ్రావణ్ పాల్గొన్నారు.



బెల్లంపల్లి ఏరియాలో 78 శాతం బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న ఏరియా జనరల్ మేనేజర్ ఎం నరేందర్

కాగజ్‌నగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా గోలేటి గనుల ద్వారా 78 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్టు ఏరియా జనరల్ మేనేజర్ ఎం నరేందర్ అన్నారు. గోలేటిటౌన్‌లోని జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ నెలలో గోలేటి గనుల ద్వారా మూడు లక్షల 50 టన్ను ఉత్పత్తిని సాధించాల్సి ఉందన్నారు. రెండు లక్షల 74వేల ఉత్పత్తి సాధించామని తెలిపారు. సమావేశంలో ఎస్ఓటు జీఎం రాజమల్లు, ఐఈడీ ఉజ్వల్‌బెహరా, పర్సనల్ మేనేజర్ ఆర్ తిరుపతి, సీనియర్ పీఓ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్టర్నేటివ్ కమిటీ సభ్యుల నియామకం

శ్రీరాంపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): జేబీసీసీఐ-11కు సంబంధించిన స్టాండర్డైజేషన్ కమిటీకి ఆల్టర్నేటివ్ సభ్యులను నియమిస్తూ కోల్ ఇండియా చైర్మన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఏఐటీయూసీ నుంచి హరిద్వార్ సింగ్, సీఐటీయూ నుంచి ఆర్‌పీ సింగ్ నియమితులయ్యారు. యూనియన్ అంతర్గత కారణాల వల్ల ఐఎన్‌టీయూసీ నుంచి ఎవరినీ నియమించలేదు.

ఎంవీటీసీలో వసతులు కల్పించాలి

శ్రీరాంపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని గనుల వృత్తి శిక్షణ కేంద్రం (ఎంవీటీసీ)లో వసతులు కల్పించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. తాగునీటి కోసం ఆర్ఓ ప్లాంటు ఏర్పాటు చేయాలని తెఇపారు. వీటీసీ స్టాఫ్‌కు వాష్‌రూమ్‌లు, క్యాంటీన్ ఏర్పాటు చేయాలని, అల్పాహారం, భోజనం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం, మే 2 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా నస్పూర్ కాలనీ తీగలప హా డ్‌కు చెందిన పైడి దుర్గా ప్రసాద్(28) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకా రం ప్రసాద్ మద్యానికి బానిసయ్యాడు.ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందుల వలన మన స్థాపం చెంది జీవితంపై విరక్తితో రవీం ద్రఖని మంచిర్యాల రైల్వే స్టేషన్‌ల మధ్య గుర్తు తెలియని రైలు కింద ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రసాద్ తల్లి శంకరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆసిఫాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఫోర్‌లైన్ రోడ్ అండర్ బ్రిడ్జి సమీపంలో శుక్రవారం రెండు బైకులు ఢీ కొన్న ప్రమాదంలో నవీన్, రాజు అనే వ్యక్తు లకు గాయాలు అయ్యాయి. గాయపడిన వారికి ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మంచిర్యాలకు తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'నీట్'కు పటిష్ట బందోబస్తు

ఆసిఫాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహజించే నీట్(యూజీ) పరీక్షకు పటిష్ట బందో ఏర్పాటు చేసినట్లు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. అభ్యర్థులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

'రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం'

మందమర్రి టౌన్, మే2(ఆంధ్రజ్యోతి) :గాలివాన బీభత్సానికి చేతికందిన పంటలు పాడైపోయాయని, ప్రధానంగా మామిడి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, కాయలు నేల రాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఎమ్మెల్యే వివేక్ ఒక ప్రకటనలో తెలిపారు. సపోట, వంటి పంటలు పూర్తిగా నేలరాలాయని, చేతికి వచ్చిన వరి పంట కూడా దెబ్బతిందని తెలిపారు. దీంతో నష్టపోయిన రైతు పంట నష్టం అంచనా వేసి ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరామన్నారు. అన్నం పెడుతున్న రైతన్నకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు.

విద్యార్థినులకు సన్మానం

జన్నారం, మే 2 (ఆంధ్రజ్యోతి) : పదవి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మా ర్కులు సాధించిన తపాలపూర్ జెడ్పీఎస్ ఎస్ పాఠశాల విద్యార్థినులను శుక్రవారం హెచ్ఎం మురళీధర్ ఘనంగా శాలువా లతో సన్మానించారు. కొండ్ర రస్మిత 535, ద్యావనపెల్లి అభినయ 517, నులిగొండ సాత్విక 516 మార్కులు సాధించగా వారిని సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు నైనాల తిరుపతి, విజయధర్మ, సత్యనారాయణ, సుశీల, కవిత, శ్రీనివాస్, శంకరయ్య, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలి

కోటపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి) : తమ హక్కుల సాధన కోసం కార్మికులం తా ఐక్యంగా ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బోడెంకి చందు అన్నారు. శుక్రవారం మండలంలోని రాంపూర్ గ్రామంలో మేడే వారోత్సవాల సందర్భంగా సీపీఎం జెండాను ఆ పార్టీ నాయకురాలు మనుమండ్ల అనసూర్య ఆవిష్కరించారు. చందు మాట్లాడుతూ వేల మంది కార్మికులు అమరులైతే 8 గంటల పని విధానం అమలులోకి వచ్చిందని, దీన్ని కేంద్ర ప్రభుత్వం 12 నుంచి 14 గంటలు చేసే యోచనలో ఉన్నారని, దీన్ని తిప్పి కొట్టాలన్నారు.

మంటలు చల్లార్చేదెలా?



మరమ్మతులకు నోచుకోక మూలనపడ్డ అగ్నిమాపక వాహనాలు

బెల్లంపల్లి అగ్నిమాపక కేంద్రంలో నీళ్లు లేని వైనం
ఫైర్ ఇంజన్‌లో నీటి కోసం ఆరు కిలోమీటర్లు వెళ్లాల్సి న దుస్థితి
దూర భారంతో ఇబ్బందులు అగ్నిప్రమాదాల్లో ఆస్తి నష్టాలు

బెల్లంపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఆదుకునే అగ్నిమాపక కేంద్రానికి సౌకర్యాలు, సిబ్బందితో పాటు నీటి సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నారు. నియోజకవర్గంలో ఉన్న ఒకే ఒక అగ్నిమాపక కేంద్రంలో సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. అగ్నిమాపక కేంద్రంలో బోరు నీటి వసతి లేకపోవడంతో ట్యాంకర్‌లో నీళ్లను నింపేందుకు ఆరు కిలోమీటర్ల దూరానికి వెళ్లాల్సి వస్తోంది. ఎక్కడైనా అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న తరుణంలో ఫోన్‌చేస్తే సిబ్బంది ఫైర్ ఇంజన్ తీసు కొచ్చే వరకు పుణ్యకాలం కాస్తా పూర్తవుతుంది. అగ్నికి ఆస్తి ఆహుతి అవుతుంది. చివరకు బాధితులకు బూడిదే మిగులుతుంది. ఎన్నో ఏళ్లగా నియోజకవర్గంలో ఉన్న అగ్నిమాపక కేంద్రంలో సమస్యలు తాండవిస్తున్నా సంబంధిత ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకో వడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నియోజకవర్గంలో ఒకే ఒక్కటి..

బెల్లంపల్లి నియోజకవర్గంలోని ఆరు మండలాలైన కన్నెపల్లి, భీమిని, తాండూర్, నెన్నెల, బెల్లంపల్లి, కాసిపేట మండలాలతో పాటు చెన్నూర్ నియోజకవర్గంలోని మందమర్రి మండలానికి సైతం బెల్లంపల్లి అగ్నిమాపక కేంద్రం నుంచే సేవలందిస్తారు. బెల్లంపల్లి నుంచి ప్రధానంగా భీమిని, కన్నెపల్లి, నెన్నెల మందమర్రి మండలంలోని పలు గ్రామాల్లో ఏదైన అగ్ని ప్రమాదం జరిగితే బెల్లంపల్లి నుంచి వెళ్లే సరికి దూర భారంతో అగ్ని ప్రమాదాలను పూర్తిగా నివారించలేకపోతున్నారు. అలాగే అగ్నిమాపక కేంద్రంలో ప్రతి వేసవిలో పలు మండలాల్లో తరుచుగా అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా రైతులు పండించిన పత్తి, వరి ధాన్యం ఇంటి గదుల్లో ధరపెరుగుతుందనే ఆశతో రైతులు నిల్వ చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బెల్లంపల్లి నుంచి 40 నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న పలు గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్న సమయంలో ఇక్కడి నుంచి ఫైర్‌ఇంజన్ వెళ్లి నిలువరించలేకపోతోంది.

సమస్యల వలయంలో అగ్నిమాపక కేంద్రం..



బెల్లంపల్లిలోని ఫైర్ స్టేషన్

బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన అగ్నిమాపక కేంద్రం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. అగ్నిమాపక కేంద్రంలో నీటి కోసం బోరు లేకపోవ డంతో ఇక్కడి నుంచి ఆరుకిలోమీటర్ల దూరంలో ఉన్న శాంతిఖని గని వద్దకు వెళ్లి నీటి ట్యాంకుల్లో నింపుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. అగ్నిప్రమాదం చోటు చేసుకున్న సమయంలో దూర ప్రాంతంలో ఉన్న శాంతిఖని గని వద్దకు వెళ్లి వచ్చే సరికి ప్రమాదాన్ని నివారించలేక ఆస్తి నష్టం జరుగుతుంది. అలాగే ఈ అగ్నిమాపక కేంద్రంలో ఒకే ఒక ఫైర్ ఇంజన్ ఉండడంతో ప్రమాదాలు చోటుచేసుకున్న సమయంలో ఆస్తి బూడిద అవుతుంది. మూలనపడ్డ ఫైర్ ఇంజన్‌లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. అలాగే గత ఏడాది 43 అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోగా లక్షల్లో నష్టం వాటిల్లింది. అగ్ని మాపక కేంద్రంలో సిబ్బంది కొరత సైతం వేధిస్తోంది. నాలుగు ఫైర్‌మన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే నియోజకవర్గంలో మరో అగ్ని ప్రమాద క్రేందంలో ఏర్పాటు చేయాలని బెల్లంపల్లిలో ఉన్న అగ్నిమాపక కేంద్రంలో బోరు ఏర్పాటు చేసి నీటి వసతి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

దీంతో బాధితులకు తీరని నష్టం ఏర్పడుతోంది.

నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నాం.. పోలు శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎస్ఎఫ్‌వో

అగ్నిమాపక కేంద్రంలో బోరు లేక పోవడంతో నీటి సమస్య వేధిస్తోంది. ట్యాంకర్‌లో నీటి కోసం శాంతిఖని గని వద్దకు వెళ్తున్నాం. దూర ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో సమయానికి వెళ్లాలని ప్రయత్నిస్తున్నాం. అగ్ని ప్రమాదాల నివారణకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.



ఖాళీగా ఉన్న నీటి తొట్టె

విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం



హాజీపూర్ మండలం దొనబండ పాఠశాలలో సమ్మర్‌క్యాంప్‌లో విద్యార్థులు

నస్పూర్, ఏప్రిల్ మే 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థిని, విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరాల్లో భాగంగా శుక్రవారం నస్పూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని ప్రధానోపాధ్యాయులు దామోదర్ రావు ప్రారంభించారు. 15 రోజుల పాటు చిత్రలేఖనం సంగీతం, డ్యాన్స్, వివిధ క్రీడలపై ఉదయం 8 గంటల నుంచి 11 వరకు శిక్షణ ఇస్తారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాజీపూర్: హాజీపూర్ మండలం దొనబండ, ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం నుంచి వేసవి శిబిరాలు ప్రారంభమయ్యాయి. దొనబండ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. హనుమాండ్లు, ముల్కల్ల ప్రధానోపాధ్యాయులు బొమ్మ గణపతి రెడ్డిల ఆధ్వర్యంలో ఈ వేసవి శిబిరాలు ప్రారంభంకాగా పలు గ్రామాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ నెల 16వ తేదీ వరకు ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు ఈ శిబిరాల నిర్వహణ కొనసాగుతుంది.

జన్నారం: మండలంలోని తలమడుగు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో వాలీబాల్ వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రధానోపాధ్యాయుడు కట్ట రాజమౌళి శుక్రవారం ప్రారంభించారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ శిబిరం ఉంటుందన్నారు. ఈ నెల 31 వరకు ఫిజికల్ డైరెక్టర్ సాగర్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు రమేష్, రాజేందర్, తిరుపతి, లక్ష్మణ్, తిరుపతి, బాపురావు, కిషన్‌గౌడ్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

●మండలంలోని కలమడుగు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం పాఠశాల హెచ్ఎం రాజమౌళి ప్రారంభించారు. 2 నుంచి 16 వరకు శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. అబాకస్‌లో పేరు ప్రఖ్యాతలు గడించిన అడ్లగట్ట గంగాధర్ స్పీడ్ మ్యాథమ్యాటిక్స్, అర్థమేటిక్స్ సులభంగా చేసే నైపుణ్యాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: జిల్లా పరిషత్ పాఠశాలల్లో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థిని, విద్యార్థులకు కంప్యూటర్‌తో పాటు నృత్యాలు ఇతర క్రీడలకు సంబంధించి శిక్షణ తరగతులకు శ్రీకారం చుడుతుంది. కేవలం జిల్లా పరిషత్ పాఠశాలల్లోనే శిక్షణ శిబిరాలను త్వరలోనే ప్రారంభించాలని మండల విద్యాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. పదిహేను రోజుల పాటు జరిగే శిక్షణ శిబిరాల్లో పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్నారు. మందమర్రిలోని ఒర్రగడ్డ జిల్లాపరిషత్ పాఠశాల, పంచముఖ ఆలయం సమీపంలోని బాలికల ఉన్నత పాఠశాలతో పాటు ఆదర్శపాఠశాలలో ఈ శిక్షణ తరగతులు జరుగనున్నాయి.

కాసిపేట: వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఎవరైన వేసవి శిక్షణ శిబిరంలోపేర్లు నమోదు చేసుకోవచ్చునని సూచించారు. ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు సాగే ఈ శిక్షణ శిబిరంలో యోగా, నృత్యం, క్రీడలు, కంప్యూటర్ శిక్షణ, కరాటే మొదలగువాటిపై శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. 15రోజులపాటు జరిగే ఈ శిక్షణ శిబిరం ఉంటుందని ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఈశిబిరానికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

కోటపల్లి : మండల కేంద్రంలోని పీఎంశ్రీ మోడల్ స్కూల్, కళాశాలలో శుక్ర వారం సమ్మర్ క్యాంపును ప్రిన్సిపల్ రాజశేఖర్ ప్రారంభించారు. 5వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు యోగా, డ్యాన్స్, పెయింటింగ్, క్రీడలు, ఇంగ్లీష్ స్కిల్స్ తదితర అంశా లపై శిక్షణ ఉంటుందన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోటపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేం ద్రంలోని పీఎంశ్రీ మోడల్ స్కూల్, కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్(ఇంగ్లీష్ మీడియం)లో ప్రవేశాల కోసం మోడల్ స్కూల్ వెబ్‌సైట్ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విభాగాల్లో ఒక్కో విభాగంలో 45 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తుదారుల మెరిట్, రిజర్వేషన్ లిస్టును ఈ నెల 26న ప్రదర్శిస్తామని, ఎంపికైన విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను ఈ నెల 25 నుంచి 31 వరకు వెరిఫికేషన్ చేసి సీట్లు కేటాయిస్తామన్నారు. జూన్ 2 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన

కన్నెపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంగంపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి కన్నెపల్లి పోలీసులు సైబర్‌మోసాలు, నకిలీ విత్తనాల నివారణ, మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించారు. వాట్సప్‌లో వచ్చే అనవసరపు లింకులను ఓపెన్ చేస్తే డబ్బులు పోతాయన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్‌ను కూడా ఎత్తవద్దని సూచించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలోనూ మహిళల ఫొటోలతో మోసం చేస్తుంటారని వాటి పట్ల జాగ్రత్త వహించాలన్నారు. అసాం ఘీక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, మూఢ నమ్మకాలను నమ్మవద్దని, అనారోగ్యంగా ఉంటే ఆసుపత్రులకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసులు పాల్గొన్నారు.

చెన్నూరు లిఫ్ట్ కథ కంచికేనా...?

(5వ పేజీ తరువాయి)

పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్‌తో నియోజకవర్గంలో సుమారు లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని మంత్రితో పాటు ఉన్నతాధికారులు ప్రకటించారు కూడా. దీంతో లిఫ్ట్ వచ్చినట్లేనని, టెండర్ ప్రక్రియనే మిగిలి ఉందన్న ప్రచారం జోరుగా జరిగింది. ఇదిలా ఉండగా ప్రాజెక్టు ఏర్పాటు కోసం సర్వేలు నిర్వహించేందుకు దాదాపు రూ. 6.87 కోట్ల వరకు ఖర్చు కూడా చేశారు. లిఫ్టుల కోసం ప్రతిపాదిత స్థలంలో భూ సేకరణ, లింక్ చానళ్ల ఏర్పాటు, తదితర అంశాలపై సమీక్ష సమావేశాలు కూడా నిర్వహించారు. కేటాయించిన బడ్జెట్‌ను అప్పటి ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. ఇదిలా ఉండగా కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజ్ 7వ బ్లాకులోని 20వ పిల్లర్ కుంగి పోవడంతో పథకం కంచికి చేరినట్లేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఎత్తిపోతల పథకం నిర్మించేందుకు చొరవ తీసుకుంటే లక్ష ఎకరాలకు సాగు నీరందే అవకాశం ఉందని ఆయకట్టు రైతులు అభిప్రాయపడుతున్నారు.

కులగణన రాహుల్ గాంధీ విజయమే

మాజీ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు

నస్పూర్, ఏప్రిల్ మే 2 (ఆంధ్రజ్యోతి) : కుల గణనకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభతరుణమని, రాహుల్‌గాంధీ చేసిన పోరాట ఫలితమే కుల గణనకు నిర్ణయం తీసుకుందని మున్సిపల్ మాజీ చైర్మన్ సుర్మిళ్ల వేణు అన్నారు. నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాహుల్‌గాంధీ ఎన్నో సంవత్సరాల నుంచి కులగణన చేయాలని పోరాటం చేస్తున్నారన్నారు. ఆ కల నిజమైనందుకు సంతోషంగా ఉందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణలో మొట్టమొదటిసారిగా కులగణను విజయంతంగా పూర్తి చేశారన్నారు. కాశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన దాడిని నిరసిస్తూ శనివారం నస్పూర్‌లోని వ్యాపార, వాణిజ్య సముదాయాలన్ని బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండ్ర లింగయ్య, భూపతి శ్రీనివాస్, నరేశ్, ఖలీద్, చక్రీ, యశోద పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

దండేపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): గూడెం గ్రామానికి చెందిన బిళ్లకూరి బాపు వారం రోజుల క్రితం పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్‌ను గుర్తించి శుక్రవారం బాధితుడికి దండేపల్లి ఎస్సై ఎండి తహసినోద్దీన్ అందజేశారు. బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సీఆర్ఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి ఫోన్ అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ ఎవరైన మొబైల్‌ఫోన్ పోగొట్టుకున్నా, దొంగించినా ఫోన్ వివరాలు వెంటనే స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు ద్వారా తెలియజేస్తే, ఈపోర్టల్ ద్వారా మొబైల్ తిరిగి పొందే అవకాశం ఉంటుందన్నారు.

ఉపాధి కల్పించేందుకే రాజీవ్ యువ వికాసం

దండేపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసంతో యువతకు ఉపాధి అవకాశం లభిస్తుందని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి డీఆర్‌డీఏ కిషన్ అన్నారు. శుక్రవారం దండేపల్లి మండల ప్రజా పరిషత్ కార్యలయంలో గ్రామ పంచాయతీల నుంచి వచ్చిన దరఖాస్తులను కార్యదర్శులు ఎంపిక చేసిన జాబితాను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడి, మండల ప్రత్యేకాధికారి దుర్గ ప్రసాద్, బీసీ కార్పొరేషన్ అధికారి అజ్మీర పురుషోత్తం నాయక్ ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, ఐకేపీ ఏపీఎం బ్రహ్మయ్య, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఘనంగా శంకరాచార్య జయంతి



శోభాయాత్ర నిర్వహిస్తున్న వేద బ్రాహ్మణులు, భక్తులు

చెన్నూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతిని శుక్రవారం చెన్నూరు పట్టణంలో భక్తులు ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాలయంలో 73వ గణపతి అధర్వశీర్ష సహస్రావర్తనలు, అభిషేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆది శంకరాచార్యుల చిత్రపటంతో పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం స్థానిక బ్రహ్మణ సేవా సంఘం భవనంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో కార్యక్రమం నిర్వాహకుడు వినోద్‌కుమార్, వేద బ్రహ్మణులు, భక్తులు పాల్గొన్నారు.

వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాలి

కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఏప్రిల్ మే 2 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఎండలు విపరీ తంగా ఉన్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో కోరారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో వైద్యా ఆరోగ్యశాఖతో పాటు ఇతర శాఖల అధికారులు వడ దెబ్బ నివారణపై వారిశాఖల ప్రణాళిక లకు అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ కార్మికులకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఉష్ణోగ్రత తక్కువ సమయాల్లో పనులు చేపించాలన్నారు. పని ప్రదేశాల్లో తప్పనిసరిగా నీడనిచ్చే సామియానాలు, తాగునీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉప కేంద్రాల్లో వైద్యాధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ వడదెబ్బ నివారణ ఔషధాలు సరిపడా అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు.

రైతుల నుంచి పూర్తి ధాన్యం కొంటాం

అదనపు కలెక్టర్ మోతిలాల్

నస్పూర్, ఏప్రిల్ మే 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 332 కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొను గోలు చేస్తామని అదనపు కలెక్టర్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 154 కొనుగోలు కేంద్రాల ద్వారా 3818 మంది రైతుల వద్ద నుంచి 33,740 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన రైతుల ఖాతాల్లో 13 కోట్ల 43లక్షల రూపాయలను జమ చేశామన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

జన్నారం, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతగూడ గ్రామంలోని ఉపాధి పని స్థలాల వద్ద శుక్రవారం దండేపల్లి ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో కూలీలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. బ్యాంకు ఖాతాలు, డిజిటల్ లావా దేవీలు, పొదుపు, రుణాలు, భీమా పథకాలు, ఏటీఎం ఉపయోగం, ఆన్‌లైన్ మోసాలపై కేంద్రం కౌన్సిలర్ రవీందర్ అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు తెలియజేయాలన్నారు. సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు రవీందర్, హరీష్, నూతన్‌కుమార్, ఎఫ్ఏ కృష్ణ, కూలీలు పాల్గొన్నారు.

కుల గణన చేయడం హర్షణీయం

గర్మిళ్ల, ఏప్రిల్ మే 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం కుల గణన చేయడానికి నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని బీసీ సంఘాల నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మంచిర్యాలలో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ కుల గణన వల్ల దేశంలోని వాస్తవిక సామాజిక వర్గాల పరిస్థితిని సమగ్రంగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రధాని మోదీకి, కేంద్రమంత్రులకు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. నాయకులు రాజేశంగౌడ్, శ్రీనివాస్, అలేఖ్య, వంశీ, నటేశ్వర్ పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మందమర్రిటౌన్, మే2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాష్ట్రీయ రహదారి వద్ద శుక్రవారం ప్రధాని చిత్రపటానికి బీజేపీ, దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు కృష్ణమోహన్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా కులగణన చేపట్టలేదని తెలిపారు. కాని ఇటీవల ప్రధాని మోదీ నిర్ణయం మేరకు దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం అన్ని వర్గాల ప్రజల ప్రయోజనం కోసమే అన్నారు. నాయకులు మార్త కుమారస్వామి, దీవి దీక్షితులు, దుర్గరాజు, దివ్యాంగుల సంఘం జాతీయ నాయకులు పెద్దపల్లి సత్యనా రాయణ పాల్గొన్నారు.

వేమనపల్లి : దేశ వ్యాప్తంగా జన, కుల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం వేమనపల్లి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు ఏట మధుకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధా నకార్యదర్శి వెంకటేష్, నాయకులు మధునయ్య, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సమయ పాలన పాటించని ఉద్యోగులకు నోటీసులు

మందమర్రిటౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని శుక్రవారం కలెక్టర్ కుమార్ దీపక్ ఉదయం 10 గంటలకు ఆకస్మికంగా సందర్శించారు. ఉద్యోగులు ఎవరు రాకపోవడంతో ఆయన అసహనానికి గురయ్యారు. కలెక్టర్ వెళ్లిన అనంతరం జెడ్పీ సీఈవో గణపతి ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. ఉద్యోగులు ఎందుకు ఆలస్యంగా వస్తున్నారని ఎంపీడీవోను ప్రశ్నించారు. ఆయన నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఎంపీడీవోతో పాటు, ఎంపీవో, ఆఫీస్ సూపరింటెండెంట్ ఈజీఎస్ సిబ్బంది మొత్తం 12 మందికి విధుల పట్ల ఎందుకు ఆలస్యం చేశారని నోటీసులు జారీ చేశారు.

ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఇందిరమ్మ ఇళ్లివ్వాలి

కోటపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో రోడ్డు వెడల్పులో భాగంగా ఇండ్లు కోల్పోయిన బాధితులకు ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింపజేయాలని కోరుతూ శుక్రవారం బీజేపీ నాయకులు తహసీల్దార్ రాఘవేందర్ రావు, ఎంపీడీవో లక్ష్మయ్యలకు వినతి పత్రాలు అందించారు. బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ దుర్గం అశోక్, మండల అధ్యక్షుడు మంత్రి రామయ్యలు మాట్లాడుతూ మండల కేంద్రంలో రహదారులు, భవనముల శాఖ ఆధ్వర్యంలో 15 మీటర్ల రోడ్డు వెడల్పు చేయడంతో పలువురు ఇండ్లు కోల్పోయారన్నారు. వీరికి గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేసిందని, ఇండ్ల నిర్మాణం కోసం సర్వే నెంబరు 389లో నాలుగెకరాల భూమిని సైతం కేటాయించిందన్నారు. సాంకేతిక కారణాలతో ఇండ్ల నిర్మాణం జరగలేదని, ప్రస్తుతం ఈ ప్రభుత్వం ఇందిరమ్మ పథకంలో వంద ఇండ్లను నిర్మించి ఇండ్లు కోల్పోయిన బాధితులకు అందించాలన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ప్రారంభానికి నోచుకోని ధాన్యం కొనుగోలు కేంద్రం

- వరికల్లంలోనే ధాన్యం కుప్పలు
- ఆందోళన కలిగిస్తున్న అకాల వర్షాలు



కల్లాల్లోనే వడ్లు ఆరబోసిన రైతులు

కాసిపేట, మే2 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంటను అకాలవర్షం భారి నుంచి కాపాడుకునేందుకు రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 20రోజుల క్రితం వరిపంటను కోసిన రైతులు వడ్లను ఎక్కడ దాచుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. గత ఐదేండ్లుగా పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కాని గడిచిన రెండు సంవత్సరాల్లో నష్టాలను మూటకట్టుకోవడంతో ఈ సొసైటీ ఈ ఏడాది వడ్లను కొనేదిలేదని చేతులెత్తేసింది. దీంతో యాసంగిలో వరి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు వాతావరణంలో వచ్చిన మార్పులు వెంటాడుతున్న వర్షాలు రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. పంట కోసిన రైతుల వద్దు వరి కల్లాలోనే ఆరబోసి కాపలాకాస్తున్నారు. ఈ నేపథ్యంలో కొందరు రైతులు దళారులకు తక్కువ ధరకే అమ్ముకొని మోసపోతున్నారు. దళారుల బారి నుంచి రైతులను కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని కోరుతున్నారు. లేదా తడిసిన వడ్లను ప్రభుత్వం వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

వడ్లను అమ్మడం కష్టమవుతుంది..



పేరం గంగయ్య రైతు తుంగగూడెం

కోసిన వరిపొలం వడ్లను వర్షంభారి నుంచి కాపాడుకోవడం చాలా ఇబ్బంది అవుతుంది. పండించిన వడ్లను రైతు కొనుగోలు కేంద్రం వద్ద అమ్ముదామంటే యాసంగిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయమన్నారు. మబ్బు వచ్చినప్పుడు వడ్లను కుప్ప చేసుకోవడం ఆరబెట్టుకోవడం చాలా ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం స్పందించి రైతు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి.



ఈదురుగాలులు.. వర్షం



పెంచికలపేటలో నేలకొరిగిన వరిపంట

పెంచికలపేట/దహెగాం, మే 2 (ఆంధ్రజ్యోతి): పెంచికలపేట, దహెగాం మండలాల్లో గురువారం రాత్రి ఈదురుగాలులలతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కోత దశలో ఉన్న వరి పంట నేలకొరిగింది. ధాన్యం కుప్పలు తడిచి పోయాయి. టార్పాలీన్లు కప్పడానికి రైతులు ఇబ్బం దులు పడ్డారు. అధికారులు త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పంటల సాగుకు రుణ పరిమితి ఖరారు

- రైతన్నకు ఆసరాగా బ్యాంకు రుణాలు
- జిల్లాలో 1.37 లక్షల మంది రైతులకు పట్టాదారుపుస్తకాలు
- 4.5 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటల సాగు



పంటల సాగుకు రుణ పరిమితిని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సాంకేతిక కమిటీ ఖరారు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వానాకాలం, యా సంగి సీజన్లలో రైతులకు అందించే రుణ పరిమితిని పెంచారు. ఈ రుణ పరిమితిని రాష్ట్రంలోని వివిధ పం టల సాగు ఖర్చును దృష్టిలో ఉంచుకుని నిర్ణయించారు.

చింతలమానేపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేస్తున్న పంటల సాగును దృష్టిలో పెట్టుకొని రైతులకు పంట రుణాలను ప్రతీ ఏడాది రాష్ట్ర స్థాయి సాంకేతిక రుణ కమిటీ పరిమితులను సూచిస్తుంది. ఆ కమిటీ సిఫారసుల మేరకు రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ 2025- 26 ఆర్థిక సంవత్సరానికి వానాకాలం, యాసంగి పంటల రుణ పరిమితిని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో రైతాంగానికి మరింత ఎక్కువగా రుణం లభించే అవకాశం ఉన్నది. మరో నెల రోజులు గడిస్తే వానాకాలం ప్రారంభం కావడం అనంతరం పంటలను సాగు చేసే అవకాశం ఉండడంతో పంటల పెట్టుబడికి ఈ రుణాలు రైతులకు ఆసరాగా నిలువనున్నాయి. ఎకరాకు ఏ పంటకు ఎంత రుణం ఇవ్వవచ్చనే ఖరారు చేస్తూ ఎస్ఎల్బీసీ (స్టేట్ లెవల్ బ్యాంకర్ల కమిటీ)కి పంపించారు. దీని ప్రకారం త్వరలో ఎస్ఎల్బీసీ ఆధ్వర్యంలో పంటల వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేయనున్నారు. గతేడాది కంటే ఎకరాకు పంట రకాన్ని బట్టి రూ. 1000 నుంచి 4000 వేలకు పెంచడంతో రైతులకు కొంత మేలు జరుగనుంది.

● 15 మండలాల పరిధిలో..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 1.37 లక్షల మంది రైతులకు పట్టా పాసుపుస్తకాలను కలిగి ఉన్నారు. పట్టా పాసుపుస్తకాల ఆధారంగానే ఏ పంటలు వేస్తారో దాని ప్రకారం బ్యాంకర్లు రుణాలు మంజూరు చేసే అవకాశం ఉన్నది. జిల్లాలో 4.5 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేయనున్నారు. కానీ చాలా మంది రైతులకు రుణాలు తీసుకోవడంలో పూర్తి స్థాయిలో అవగాహన లేకుండా పోయింది. ఇందులో సుమారుగా 70 వేల మంది రైతులు మాత్రమే రుణాలు తీసుకుంటున్నట్లు తెలుస్తున్నది. చాలా మంది రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద అప్పులు తీసుకొని పంటలు చేతికొచ్చిన అనంతరం వాటిని ఎక్కువ వడ్డీలు చెల్లిస్తూ నష్టపోతున్నారు. గ్రామాల్లో రుణాల పట్ల రైతులకు అవగాన కల్పించాల్సిన అవసరం ఉన్నదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరం వ్యవసాయ, అనుబంధ రుణాలు జిల్లాలో 70 -72 శాతం పైగా లక్ష్యం చేరుకున్నాయి. ఈ ఏడాది మరింత మందికి రుణాలు అందే అవకాశం ఉన్నది. మరో వైపు పంట రకాన్ని బట్టి ఎకరానికి ఖరారు చేసిన రుణ పరిమితిని సైతం చాలా బ్యాంకులు అమలు చేయడం లేదని చెబుతున్నారు.

ప్రధాన పంటలకు రుణ పరిమితి ఇలా..

పంట	గత ఏడాది (రూపాయల్లో)	- పెంపు
కూరగాయలు	35,000	70,000
మిరప	84,000	86,000
పత్తి	46,000	48,000
సోయా	28,000	30,000
మినుము	20,000	22,000
పెసరా	20,000	22,000
కంది	23,000	25,000
మక్క	34,000	36,000
వరి	44,000	46,000
ఆయిల్పామ్కు ఐదో ఏడాది నుంచి	46,000	48,000

● మరింత రుణం..

పంటలకు రుణ పరిమితి ఖరారు కావడంతో అన్నదాతలకు కొంత మేర అధికంగా రుణాలు అధికంగా అందే అవకాశం ఉన్నది. సుమారుగా 122 రకాలైన పంటలకు రుణ పరిమితి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇవే కాకుండా పాడి, కోళ్ల, గొర్రెలు, మేకలు, పందులు, తేనెటీగల పెంపకం తదితర యూనిట్లకు రుణాలు ఇవ్వనున్నారు. కానీ ఆయిల్పామ్ పంట సాగుకు మాత్రం మొక్కలు నాటిన ఐదో ఏడాది నుంచి రుణం మంజూరు చేయనున్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

వాంకిడి, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోనాపూర్, చిచ్చుపల్లి గ్రామాల్లో శుక్రవారం హెచ్ఈవో రవిదాస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి రక్తనమునాలు సేకరించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ క్రిష్టియానా, సిబ్బంది భగవన్దాస్, గోదావరి, సునంద, ఆశా కార్యకర్తలు కిస్టుబాయి, కమల, సునీత, మాన్కుబాయి పాల్గొన్నారు.

ఎస్టీఎంఈ ల్యాబ్ ప్రారంభం

ఆసిఫాబాద్ రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్టీఎంఈ ల్యాబ్ను ఐటీడీఏ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉద్దవ్ ప్రారంభించారు. డీడ బ్ల్యూపీ ఇంటర్ఫేస్ ఆర్థిక సహకారంతో విభ అండ్ సీవైడీఏ ఆధ్వర్యంలో ఐటీడీఏ మద్దతుతో ఎస్టీఎంఈ ల్యాబ్ను ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం జంగు, సీవైడీఏ సంస్థ ప్రతినిధు లు నరేష్, బాలకృష్ణ, రవీందర్ పాల్గొన్నారు.

నేటి నుంచి దరఖాస్తుల పరిశీలన

వాంకిడి, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నుంచి రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను పరిశీలించనున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3న బమ్మెర, బెండార, సామెల గ్రామాల దరఖాస్తులు పరిశీలించనున్నామని పేర్కొన్నారు. 5న చిచ్చుపల్లి, చౌపన్గూడ, దాబా, దొడ్డిగూడ, నవేదరి, సర్వాతి, 6న గోయగాం, కిర్డి, పిప్పర్గొంది, సోనాపూర్, 7న ఖమాన, 8న ఇందాని, నవేగాం గ్రామాల్లోని దరఖాస్తులు పరిశీలిస్తామని తెలిపారు.12న పాటగూడ, సరండి, జైత్పూర్, తేజాపూర్, 13న వాంకిడి గ్రామ పంచాయతీ లబ్ధిదారుల దరఖాస్తులు పరిశీలించనున్నామని తెలిపారు.

అటవీ అధికారుల ఆంక్షలు సరికావు

బెజ్జూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): అటవీ అధికారులు ఇళ్ల నిర్మాణంలో విధిస్తున్న ఆంక్షలు సరికాదని సుస్మీర్ గ్రామస్థులు అన్నారు. శుక్రవారం ఎంపీడీవో ప్రవీణ్కుమార్కు వినతి పత్రం అందజేశారు. ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నమూనా గ్రామంగా సుస్మీర్ను ఎంపిక చేశారని అన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపడుతుండగా అటవీ అధికారులు అడ్డుపడుతున్నారని చెప్పారు. స్లాబ్ వేసుకోవద్దని అధికారులు తెలపడంతో ఇంటి నిర్మాణాలు ఏ విధంగా చేపట్టాలని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అటవీ శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే హరీష్బాబు

కాగజ్నగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): కాగజ్నగర్ కన్యాకపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్బాబు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యసంఘం సభ్యులు ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు శంకరయ్య, చిలువేరు సత్యనారాయణ, గంగాధర్, ఘనపురం ప్రకాష్, సత్యనారాయణ, రాజేంద్ర ప్రసాద్, ప్రవీణ్తో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



డీసీసీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న గ్రామస్థులు

వాంకిడి, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండోకర్వాడ, లంజన్వీర గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా మంజూరైన సీసీ రోడ్డు పనులను డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిదులు మంజూరు చే స్తోందని తెలిపారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడిని గ్రామస్థులు సన్మానించారు. కార్యక్ర మంలో పెంటు, నారాయణ, ప్రశాంత్, గణేష్, దాదాజీ, అనిల్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాగజ్నగర్ టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): కాగజ్నగర్ మండలంలోని చింతగూడ బలగల మైనారిటీ బాలురు-1 కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రోమి ప్రతిభ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఎంపీసీ, బైపీసి మొదటి సంవత్సరం ఇంగ్లీష్ మీడియంలో చేరేందుకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 75శాతం (60) సీట్లు మైనార్టీలు, 25 శాతం (20) బీసీ-10, ఎస్సీ-4, ఎస్టీ-4, ఓసీ-2 సీట్లు మైనార్టీయేతర విద్యార్థులకు కేటాయించినట్లు పేర్కొన్నారు. వివరాలకు 7331170840లో సంప్రదించాలని సూచించారు.

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

చేతి పంపునకు మరమ్మతు

పెంచికలపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): కొండపల్లి గ్రామంలోని మహారాజుల కాలనీలో శుక్రవారం బోరుకు మరమ్మతు చేపట్టారు. మిషన్ భగీరథ నీరు అందక చేతి పంపు పాడై ఇబ్బందులు పడుతున్నారని గురువారం 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో ప్రచురితమైన 'కాలనీలో తాగునీటి సమస్య' అనే కథనానికి పంచాయతీ అధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు చేపట్టారు. కానీ మిషన్ భగీరథ పైపు లైన్ ఉన్న నీరు అందడం లేదు. మిషన్ భగీరథ అధికారులు చర్యలు తీసుకుంటే తమ సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారం అవుతుందని కాలనీవాసులు చెబుతున్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

కాగజ్నగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని కాగజ్నగర్ ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. కాగజ్నగర్ మండలంలోని కోసిని, ఈసుగాం, నజ్రూల్నగర్ గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా పెండింగ్ పనుల స్థితి గతులను తెలుసుకున్నారు. నర్సరీని, ఉపాధి హామీ పనులను పరిశీలించారు. వడదెబ్బ తాకకుండా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

అనాథ యువతి వివాహానికి చేయూత

లింగాపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఓ యువతి వివాహనికి శుక్రవారం స్థానికులు రెండున్నర లక్షల రూపాయల విలువ గల సామగ్రి అందజేసి అండగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన తెలంగాణా మలిదశ ఉద్యమకారుడు జాదవ్విలాస్ నాయక్, కవిత దంపతులు కొంల కాలం క్రితం మృతి చెందారు. వారి రెండో కుమార్తె జాదవ్ స్వాతి వివాహనికి మండలంలోని ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉదో గులు, సామాజిక కార్యకర్తలు, సామగ్రి అందజేశారు. వివాహానికి ఎమ్మెల్యే కోవ లక్ష్మి హాజరై వధూవరులను ఆశీర్వందించారు.

ఆదివాసీలు సంస్కృతిని కాపాడుకోవాలి

సిర్పూర్(యు) మే 2 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు సంస్కృతీ, సాంప్రదాయాలను కాపాడుకోవాలని పలువురు అధికారులు అన్నారు. ఆదివాసీ గోండు గిరిజన యోధుడు రాం గోండ్ పేరట హైదరాబాదులో ఏర్పాటు చేయనున్న మ్యూజియంలో గోండు సాంప్రాదాయ వస్తువులను సేకరించేందుకు అధికారులు శుక్రవారం మండలంలోని భాండియ్యర్కు చేరుకున్నారు. ఈ సందర్భంగా సాంప్రాదాయ పండుగలు, పెళ్లిళ్ల, గృహోపకరణాలు, వ్యవసాయ వస్తువులు, ఆభరణాలు వంటి వస్తువులను తిలకించారు. వీటీడీఏ అధ్యక్షుడు కుంర భీంరావ్ సాంప్రాదాయ వస్తువులను సేకరించారు. దీంతో అధికారులు భీంరావ్ను అభినందించారు.

ఏర్పాట్లను పరిశీలించి.. సూచనలు చేసి..

రెబ్బెన, మే 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సోమవారం పర్యటించనున్నందున చేపడుతున్న ఏర్పాట్లను శుక్రవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రే పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. మండలంలోని క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారి ప్రారంభోత్సవానికి సోమవారం కేంద్ర మంత్రి గడ్కరి రానున్నారు. ఇందుకు ఏర్పాటు చేస్తున్న సభా స్థలిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పార్కింగ్ సౌకర్యం, భోజన వసతి కల్పించాలని అధికారులకు సూచించారు. మంత్రి పర్యటన సందర్భంగా తీసుకోవల్సిన భద్రతా ఏర్పాట్లను ఆయన అధికారులతో చర్చించారు. సమావేశానికి హాజరయ్యే నాయకులు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసువాలని ఆయన సూచించారు. యన వెంట ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు, సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో పాటు ఇతర అధికారులు ఉన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు వెళ్లాలి

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే దిశగా ఏకాగ్రత, పట్టుదలతో ముందుకు వెళ్లాలని కలెక్టర్ వెంటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి జిల్లాలోని గుండి జిల్లా పరిషత్ పాఠశాల మొట్టమొదటి బ్యాచ్ విద్యార్థులు పదోతరగతి ఉత్తీర్ణులైన సందర్భంగా అభినందించారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధి చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న అధికారులు

ఆసిఫాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారత్ సంచార్ నిగం లిమిటెడ్ నెట్వర్క్ టవర్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో శుక్రవారం కాగజ్నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, కాగజ్నగర్ డివిజన్ ఫారెస్ట్ అధికారి సుశాంత్ బోగాడేతో కలిసి తహసీల్దార్లు, రేంజ్ అధికారులు, బీఎస్ఎన్ఎల్ అధికారులతో టవర్ల ఏర్పాటుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రతి మారు మూల ప్రాంతాలకు మొబైల్ నెట్వర్క్, సేవలు అందించే విధంగా సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ల నిర్మాణం, నూతన టవర్ల నిర్మాణం కోసం స్థలాల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అవసరమైన చోట అటవీ, రెవెన్యూ శాఖల అధి కారులు సంయుక్తంగా సర్వే నిర్వహించాని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్కుమార్ పాల్గొన్నారు.

అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలి

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశామని అన్నారు. 287 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని చెప్పారు. ఇందులో 209 మంది మహిళలు, 78 మంది పురుష అభ్యర్థులు ఉన్నారని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్షా కేంద్రంలోని అనుమతించనునన్నామని అన్నారు. ప్రతీ అభ్యర్థి బయోమెట్రిక్ హాజరు నమోదు చేయనున్నామని చెప్పారు. ప్రతి గదిలో 24 మంది విద్య అభ్యర్థులు ఉంటారని అన్నారు. ప్రతి గదిలో ఇద్దరు ఇన్విజిలేటర్లు విధులు నిర్వహిస్తారని చెప్పారు. పరీక్ష పూర్తిగా సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపారు.

'రాజీవ్ యువ వికాసం'

దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు



లబ్ధిదారుల ఎంపికకు దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 30,016 మంది యువకులు దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా సామాజిక వర్గాల వారీగా బీసీ 12,587, ఎస్టీ 7,370, ఎస్సీ 6,939, మైనార్టీ 2,677, ఈబీసీ 413, క్రిస్టియన్ 30 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. మొదట ఆన్లైన్, ఆఫ్లైన్లో స్వీకరించిన దరఖాస్తులను ఆయ సామాజిక వర్గాల వారీగా విభజించారు. అబ్ధిదారుల వివరాలను పునఃపరిశీలించి తుది జాబితా రూపొందించారు. 15 మండలాల పరిధిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారితో పాటు ప్రత్యేకాధికారి, ఏపీఎం, బ్యాంకు మేనేజర్, సామాజిక వర్గాల ఆర్థిక సంస్థల ప్రతినిధులతో కూడిన కమిటీ ద్వారా ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నారు. లబ్ధిదారులు ఎంచుకున్నయూనిట్లతో పాటు అయా రంగాల్లో నైపుణ్యాలు, అనుభవాలపై ఆరా తీసీ స్వయం ఉపాధి సాధ్యాసాధ్యాలను అంచనా వేసి జాబితాను జిల్లా స్థాయి కమిటీకి నివేదించనున్నారు. జిల్లా స్థాయిలో ఛైర్మన్గా కలెక్టర్, ఎనిమిది మంది వివిధ శాఖల అధికారులు సభ్యులుగా వ్యవహరిస్తూ తుది జాబితాను ఖరారు చేసి ఆమోదానికి పంపిస్తారు. మొత్తం యూనిట్లలో 25 శాతం మహిళలకు కేటాయిస్తారు. ఇందులో ఒంటరి, వితంతు మహిళలకు ప్రాధాన్యం ఇస్తారు. మరో ఐదు శాతం దివ్యాంగుల కోటాగా నిర్ధారించారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాయలంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎస్బీఐ బ్యాంకు పరిధిలోని కోటారి, రింగన్ఘాట్, గోయగాం, ధనోర గ్రామాల లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అంజద్పాషా తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమిని, మొగవెల్లి, కుశ్నపల్లి, తలాయి, పాపన్నపేట గ్రామ పంచాయతీల లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్కుమార్, టీజీబీ మేనేజర్ సత్యకిరణ్, ఏపీఎం మోహన్లాల్ తదితరులు పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): అయినం, పెసరికుంట గ్రామ పంచాయతీల పరిధిలో నిరుద్యోగులు చేసుకున్న దరఖాస్తులు పరిశీలించారు. కార్యక్రమంలో టీజీబీ మేనేజర్ నవీన్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండలంలో రాజీవ్ యువ వికాస దరఖాస్తులను ఎంపీడీవో కార్యాలయంలో పరిశీలించారు. నివేదికలను కలెక్టర్కు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీఎం దుర్గయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ అధికారులు, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.